క్లుప్తంగా

బాబా మందిరానికి గోవు, రూ.60 వేలు విరాళం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరానికి శ్రీనగర్ కాలనీకి చెందిన దాత గరికపాటి శ్రీనివాసరావు, జ్యోతి దంపతులు ఆదివారం గోవు, పశుగ్రాసం కోసం రూ. 60వేలు విరాళాన్ని మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతంరెడ్డి గోశాలకు గోవుతో పాటు పశుగ్రాసం కోసం రూ. 60వేలు అందజేసిన దాత గరికపాటి శ్రీనివాసరావు, జ్యోతి దంపతులను అభినందించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి బాబావారి ప్రసాదం, శేషవస్త్రంతో దాతలను సత్కరించారు. కార్యక్రమంలో మందిర కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

నేడు వీఎంసీ పీజీఆర్ఎస్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ నగర వాసులకు కల్పించే మౌలిక వసతుల్లో నెలకొనే సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమం (పీజీఆర్ఎస్) వీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు నగరంలోని మూడు సర్కిళ్లలో కూడా నిర్వహిస్తున్నామని కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం చిట్టినగర్‌లోని సర్కిల్–1 కార్యాలయంలో, సత్యనారాయణపురంలోని సర్కిల్–2 కార్యాలయంలో, పటమటలోని సర్కిల్–3 కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆయా కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు, ఇతర విభాగాల అధికారులు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని చెప్పారు. నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజా కాపునాడు నూతన కమిటీ ఎంపిక



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం 57వ డివిజన్ నూతన కమిటీ సభ్యుల ఎంపిక న్యూరాజరాజేశ్వరీపేటలోని ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగింది. 57వ డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా నంబాక విజయ్, ప్రధాన కార్యదర్శిగా విజ్జి మన్మథరావు, ఉపాధ్యక్షులుగా వెన్నెల గణేష్‌కుమార్, పిన్నింటి దుర్గారావు, కార్యదర్శులుగా దొంతల సాయి, కొఠారి తేజ, నంబాక ప్రసాద్, బంటుమిల్లి మధుసూదన్, సూరబత్తుల శివకుమార్‌లు ఎంపికయ్యారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు నూతన కమిటీ సభ్యులను సన్మానించి వారికి నియామక పత్రాలను అందజేశారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): థర్మల్ కాలువ వైపు వెళ్లి యువకుడు అదృశ్యమైన ఘటన గొల్లపూడిలో జరిగింది. భవానీపురం పోలీసులు తెలిపిన వివరాలు.. గొల్లపూడి ఎస్ఎస్ఎస్ కాలనీకి చెందిన బాలాజీ(23) యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డ్స్, లైఫ్ ఇన్సూరెన్స్ చేస్తుంటాడు. ఆదివారం ఉదయం థర్మల్ కాలువ వైపు వెళ్లాడు. ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ చేస్తుంటే స్విచాఫ్ వచ్చింది. అనుమానంతో ఆయన సోదరుడు మరికొందరు కలిసి వెతికినా ఆచూకీ దొరకలేదు. సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అమ్మవారికి ఆషాఢ సారె



మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రీయ స్వామి వివేకానంద సేవా సంఘ్, అరుణేశ్వరి మహిళా శక్తి విభాగ్ ఆధ్వర్యాన ఆదివారం మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ భక్తులు కనకదుర్గమ్మ అమ్మవారికి ఆషాఢ సారెను తీసుకువెళ్లారు. పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు సారెను చేతబట్టుకుని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారిని ఉంచి జై భవానీ అంటూ ఇంద్రకీలాద్రికి తరలివెళ్లారు.

రామకృష్ణాపురంలో అన్నదానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం దుర్గాదేవి దేవాలయం వద్ద ఆదివారం లయన్స్ మల్టీ సర్వీస్ ట్రస్ట్, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఇమేజ్ ఆధ్వర్యాన దాత వీ సుగుణ సహకారంతో అన్నదానం జరిగింది. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ గాట్ వైస్ ఛైర్ పర్సన్ వై. గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని అన్నదానం ప్రారంభించారు. శ్రీరాం పవన్, డీసీఎస్ ట్రస్ట్ ఛైర్మన్ రామారావు, ట్రస్ట్ కోశాధికారి మాధవీలత, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కాదేదీ కబ్జాకనర్హం..!

- మురుగుకాలువలపైనే బడ్డీలు, వ్యాపారాలు
- నిర్మాణాలు చేసి అద్దెకిస్తున్న వైనం
- పట్టించుకోని వీఎంసీ అధికారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కబ్జారాయుళ్లు మురుగుకాలువలను సైతం వదలడం లేదు. మధురానగర్, పసుపుతోట, దుర్గాపురం, బావాజీపేట, మాచవరం, జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, రామకృష్ణాపురం, దేవీనగర్ తదితర ప్రాంతాల్లో మురుగుకాలువలపై నిర్మాణాలు చేస్తున్నారు. మురుగుకాలువలను మూసివేసి రోడ్డుపైకి ఆక్రమణలు చేస్తున్నా వీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ముఖ్యంగా ప్రధాన కూడళ్లు, మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో మురుగుకాలువలను దాటి సుమారు నాలుగు నుంచి ఐదు అడుగుల మేర ఆక్రమించి టైల్స్, మార్బుల్స్, గ్రానైట్‌లను వేసి అద్దెలకు ఇస్తున్నారు. దీంతో విశాలమైన రోడ్డు ఉన్నప్పటికీ ఉపయోగం లేకుండా పోతోందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దుర్గాపురంలో మురుగుకాలువను మూసివేసి రోడ్డు వరకు వేసిన ఫ్లోరింగ్

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పసుపుతోట మెయిన్‌రోడ్డులో మురుగుకాలువపై టైల్స్ వేసి మూసివేయడంతో పాటు వాటిపైనే బడ్డీలను ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. మురుగుకాలువలను మూసివేయడం వల్ల తాము ఎలా శుభ్రం చేయాలో తెలియడం లేదని పారిశుద్ధ్య సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది మురుగుకాలువ శుభ్రం చేసేందుకు మ్యాన్‌హోల్ వదులుతున్నారు. మరికొందరైతే ఏకంగా మొత్తం ఫ్లోరింగ్ చేసి అద్దెలకు ఇస్తున్నారు. మధురానగర్ ఆర్‌యూబీ నుంచి వర్షంనీరు పోయేందుకుగానూ ఏలూరు కాలువలోకి కనెక్షన్ ఇచ్చేందుకుగానూ మురుగుకాలువ నిర్మించారు. అయితే ఈ మురుగు కాలువను ఎవరికి వారు వారి ఇంటి ముందు సొంతం ఫ్లోరింగ్ చేసుకున్నారు. కొంత మంది అయితే అద్దెలకు సైతం ఇచ్చుకున్నారు. ఒక వేళ ఇక్కడ మురుగుకాలువ బ్లాక్ అయ్యితే పరిస్థితి ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి మురుగుకాలువలను మూసివేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మధురానగర్ బావిరోడ్డులో మురుగుకాలువపై ఏర్పాటు చేసిన పచ్చబడ్డీ



దావు బుచ్చయ్యకాలనీలో మురుగుకాలువ దాటి రోడ్డుపైకి వచ్చిన ర్యాంపు

శిథిలమవుతున్న కాలువలు

మధురానగర్ వీవీనరసరాజు రోడ్డులో మురుగుకాలువలను దాటి మరీ నిర్మాణాలు చేస్తున్నారు. ఇక్కడ రోడ్డు విశాలంగా ఉండటంతో కొంత మంది పశువుల పాకలను సైతం ఏర్పాటు చేశారు. దీనివల్ల విశాలంగా రోడ్డు ఉన్నప్పటికీ వినియోగంలో లేకుండా పోతుందని వాహన చోదకులు వాపోతున్నారు. అలాగే నూతనంగా నిర్మాణాలు జరుగుతున్న జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ ప్రాంతాల్లో సైతం మురుగుకాలువలను దాటి నిర్మాణాలు చేస్తున్నారు. నగరంలోని పలు చోట్ల మురుగుకాలువలు శిథిలమయ్యాయి. వీఎంసీ అధికారులు స్పందించి శిథిలమైన మురుగుకాలువలను సరిచేయడంతో పాటు ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



బావిరోడ్డులో శిథిలమైన మురుగుకాలువ

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



ముత్యాలంపాడులో వెంకటేశ్వరస్వామి



శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో స్వామివారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో తొలి ఏకాదశిని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన శ్రీదేవి, శ్రీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. స్వామివారికి పంచామృత అభిషేకం, లక్ష తులసి అర్చనలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ముత్యాలంపాడులోని శ్రీకోదండ రామాలయంలో తొలి ఏకాదశి పురస్కరించుకుని వేంకటేశ్వర స్వామివారికి విశేషంగా అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. ఆంధ్రాషిర్డీ ముత్యాలంపాడులోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం తొలి ఏకాదశి పురస్కరించుకుని బాబావారికి తులసి అర్చనలు, పూజలు చేశారు. శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, వేదపఠనం చేశారు. కార్యక్రమంలో మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

నూతన ఆవిష్కరణలతో మెరుగైన చికిత్సలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆధునిక ఆవిష్కరణలను అందిపుచ్చుకుని ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందించాలని రెయిన్‌బో హాస్పటల్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ రామ్ ప్రసాద్ శిష్టా తెలిపారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, నేషనల్ నియోనెటాలజీ ఫోరం సహకారంతో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నేప్–2025 పేరుతో నియోనేటల్ అండ్ పీడియాట్రిక్ ఎమర్జెన్సీస్ సదస్సు ఆదివారం నిర్వహించారు. నగరంలోని ఓ హోటల్లో ఆదివారం నిర్వహించిన ఈ సదస్సులో డాక్టర్ రామ్ ప్రసాద్ మాట్లాడుతూ నవజాత శిశువులు, చిన్నపిల్లలకు సంబంధించిన అనేక నూతన చికిత్సా విధానాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఆధునిక వైద్య చికిత్సలను ప్రజలందరికీ చేరువ చేసేందుకు రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ కృషి చేస్తుందని తెలిపారు. ఆ క్రమంలోనే, గత పదేళ్లుగా 'నేప్' సదస్సులు నిర్వహిస్తూ వస్తున్నామని చెప్పారు. నవజాత శిశువులు, చిన్నపిల్లలకు సంబంధించిన అత్యవసర చికిత్సల్లో అత్యంత అప్రమత్తత అవసరమని పేర్కొన్నారు. సమస్యను నిర్ధారించుకోవడం, సరైన నిర్ణయం తీసుకోవడం, సకాలంలో చికిత్స అందించడం కీలకాంశాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. రెయిన్‌బో విజయవాడ ఫెసిలిటీ డైరెక్టర్, నేప్–2025 నిర్వాహకులు డాక్టర్ వి.ప్రసాద్, హాస్పిటల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ కంచర్ల, ఇంటెన్సివ్ కేర్ డైరెక్టర్ డాక్టర్ దినేష్ కుమార్ చిర్ల మార్గదర్శంలో ఈ సీఎంఈ నిర్వహించారు. డాక్టర్ బి.ఎస్.సి.పి. రాజు, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ వంశీ శివరామరాజు, డాక్టర్ వీణ అక్కినేని పాల్గొన్నారు.



నేప్ 2025పై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ రామ్‌ప్రసాద్, డాక్టర్ రమేష్ తదితరులు

ఘనంగా బాలమురళీ కృష్ణ జయంతి

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, జీవీఆర్ సంగీత కళాశాల, డాక్టర్ మంగళంపల్లి బాలమురళీ కృష్ణ సంగీత కళాశాల గుంటూరు ఆధ్వర్యాన దుర్గాపురంలోని జీవీఆర్ సంగీత కళాశాలలో ఆదివారం సంగీత విద్వాంసుడు పద్మవిభూషణ్ మంగళంపల్లి బాలమురళీ కృష్ణ జయంతి, డీవీ మోహనకృష్ణ సంగీత కచేరీ, ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంగళంపల్లి ఆత్మీయ మిత్రుడు అన్నవరపు రామస్వామి మాట్లాడుతూ తెలుగు వారి సంగీత చరిత్రను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు మంగళంపల్లి అని అభివర్ణించారు. భాషా సాంస్కృతిక శాఖ సీఈవో ఆర్ మల్లికార్జునరావు మాట్లాడుతూ 2026 జనవరిలో అమరావతి సంగీతోత్సవం నిర్వహిస్తునట్లు తెలిపారు. అనంతరం మోహన కృష్ణను సత్కరించారు. కార్యక్రమంలో సృజనాత్మక సమితి సహాయ సంచాలకులు పెంచలయ్య, సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, కళాశాల ప్రిన్సిపాల్ కే లక్ష్మీనరసమ్మ, గుంటూరు సంగీత కళాశాల ప్రిన్సిపాల్ మార్టూరి హరిబాబు, సంగీత విద్వాంసులు, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే శ్రీసుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని సంస్థ కార్యాలయంలో మంగళంపల్లి జయంతి సందర్భంగా నిర్వహించిన సంగీత కచేరీలు మధురంగా సాగాయి.



డీవీ మోహన కృష్ణను సత్కరిస్తున్న సంగీత విద్వాంసులు, సీఈవో మల్లికార్జునరావు

వరకట్న వేధింపులపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అదనపు కట్నం తేవాలంటూ భర్త, మామ వేధిస్తున్నారంటూ మహిళ భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. గొల్లపూడి మైలురాయి సెంటర్‌కు చెందిన గజ్జి శ్రీవాణికి రెడ్డిగూడెం మండలం పాత నాగులూరుకు చెందిన రామకోటేశ్వరరావుతో 2018లో వివాహమైంది. ఆ సమయంలో రూ. 4 లక్షలు కట్నం ఇచ్చారు. వివాహానికి ముందే ఆమెకు బొల్లి మచ్చలు ఉన్నాయి. పెళ్లి చూపుల్లో అవి చూసుకునే పెళ్లికి అంగీకరించారు. పెళ్లయిన తర్వాత రెండు నెలలు వీరి కాపురం సజావుగా సాగింది. ఆ తర్వాత భర్త రామకోటేశ్వరరావు, మామ నాగేశ్వరరావు వేధించ సాగారు. అయినప్పటికీ సర్దుకుపోతూ కాపురం చేసింది. ఆమెకు ఇద్దరు పిల్లలు పుట్టారు. ఆ తర్వాత వేధింపులు మరింత అధికమయ్యాయి. బొల్లి ఉన్నా పెళ్లి చేసుకున్నానని, అదనపు కట్నం ఇవ్వాలని మానసికంగా, శారీరకంగా వేధించారు. ఈ నేపథ్యంలో పిల్లలను తీసుకుని పుట్టింటికి చేరింది. ఆమె పుట్టింటికి వచ్చినా పలు రకాలుగా వేధించడం, అనుమానంతో అవమానించడం చేయసాగారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. స్థానిక ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో ఆదివారం వైఎస్సార్ సీపీ క్లస్టర్ కమిటీ సభ్యులతో మల్లాది విష్ణు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నియమితులైన క్లస్టర్ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. తాను ఎల్లప్పుడూ క్లస్టర్ కమిటీ సభ్యులకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అనంతరం విష్ణును క్లస్టర్ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో క్లస్టర్ అధ్యక్షులు పిల్లుట్ల వంశీ, పసుపులేటి యేసు, సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. కాగా ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని గుర్తుకు తెస్తూ 'రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో' కార్యక్రమాన్ని ఈనెల 9వ తేదీ సాయంత్రం 4.30గంటలకు అంబాపురం ఎస్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు మల్లాది విష్ణు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ, విజయవాడ పార్లమెంట్ పరిశీలకుడు వేణుగోపాల్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు.



మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణును సత్కరిస్తున్న క్లస్టర్ కమిటీ సభ్యులు



బందరు రోడ్డులోని పశువుల ఆస్పత్రి వద్ద పెంపుడు కుక్కలు, పిల్లులకు వ్యాక్సిన్లు వేయించేందుకు తీసుకొచ్చిన దృశ్యాలు

పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్‌లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): జూనోసిస్ డేను పురస్కరించుకుని లబ్బీపేటలోని డాక్టర్ ఎన్టీఆర్ వెటర్నరీ సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్‌లో ఆదివారం పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్‌లు వేశారు. ఈ శిబిరాన్ని తొలుత పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ డాక్టర్ టి.దామోదర్‌నాయుడు, వ్యవసాయ, పశు సంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం రాజశేఖర్ మాట్లాడుతూ జునోటిక్ వ్యాధుల నివారణ, నియంత్రణ, మన ఆరోగ్యంపై దాని ప్రభావం గురించి అవగాహన కలిగించారు. పెంపుడు జంతువులకు సమయానుకూలంగా వ్యాక్సిన్ వేయడం, శుభ్రత పాటించడం, బాధ్యతతో పెంపకం ద్వారా వాటి నుంచి మానవులకు వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చుని తెలిపారు. అనంతరం దామోదరనాయుడు మాట్లాడుతూ ఈ శిబిరం ద్వారా అనేక మంది పెంపుడు జంతు యజమానులకు, జంతు సంరక్షులకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. మానవులకు ప్రాణాంతకమైన రేబిస్ వ్యాధి పూర్తిగా నివారించదగినదే అనే విషయాన్ని ఈ శిబిరం ద్వారా తెలియచేస్తున్నట్లు తెలిపారు. జూనోసిస్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, హాస్పటల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి.ప్రేమ్‌చంద్, డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ చంద్రమౌళి నాయక్, మెడికల్ అండ్ హెల్త్ శాఖకు చెందిన డాక్టర్ హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 520 కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్‌లు వేశారు.

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు అనితర సాధ్యం

వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఉప ప్రధాని బాబూజగ్జీవన్ రామ్ దేశానికి అందించిన సేవలు అనితర సాధ్యమని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఆదివారం జింఖానా మైదానం సమీపంలోని ఆయన విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. మల్లాది విష్ణు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ కార్మిక శాఖ, రైల్వే శాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. జగ్జీవన్‌రామ్ దళితులు, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి బాటలు వేశారన్నారు. ఆయన ఆలోచన విధానాన్ని వైఎస్సార్ సీపీ, వైఎస్ జగన్ పాటిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్యామ్, నందెపు సురేష్, డివిజన్ అధ్యక్షుడు పులప కృష్ణ, డివిజన్ యూత్ అధ్యక్షుడు తాడి శివ, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి వెన్నా రత్నారావు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందర్ పాల్, ఒగ్గు గవాస్కర్, బండారు ఆంజనేయులు పాల్గొన్నారు.



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గొప్ప సంఘ సంస్కర్త జగ్జీవన్‌రామ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): దళితుల హక్కుల సాధనకు కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్‌రామ్ అని 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని గిరిపురంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు కొమ్ము చంటి, కుక్కల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



గిరిపురంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ అనిత

కార్మికులంతా ఐక్యంగా పోరాడాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలంటే కార్మిక వర్గం ఐక్యంగా పోరాటాలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. రైల్వే స్టేషన్ పార్సిల్ ఆఫీస్ ఆటో స్టాండ్ జనరల్ బాడీ విస్తృత సమావేశం బీఆర్టీఎస్ రోడ్డులోని నండూరు ప్రసాదరావు భవన్ సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్ రంగం చాలా శక్తివంతమైన రంగమని అన్నారు. ఆటో, మోటార్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మోటార్ రంగ కార్మికులంతా ఐక్యంగా పోరాటం చేయాలని సూచించారు. సీఐటీయూ సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కే దుర్గారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ఈనెల 9వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల మృతిచెందిన పార్సిల్ ఆఫీస్ రైల్వే స్టేషన్ ఆటో స్టాండ్ కమిటీ సభ్యుడు బి.సన్యాసిరావు భార్య లక్ష్మికి రూ. 10.వేలు అందజేశారు. కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు పార్సిల్ ఆఫీస్ సీఐటీయూ ఆటో స్టాండ్ నాయకులు పి. తిరుపతయ్య, ఎం.కొండ, జె.సూర్యనారాయణ, బి. వెంకటేశ్వరరావు, బి.లక్ష్మణ, జి.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నర్సింగరావు

దోమల నివారణకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరపాలకసంస్థ మలేరియా విభాగం సిబ్బంది 30వ డివిజన్ జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్, దేవీనగర్ తదితర ప్రాంతాల్లోని ఖాళీస్థలాల్లో నిలిచిన వర్షంనీటిలో గంబూసియా చేపలు, మురుగునీటిలో దోమల నివారణ మందులు స్ప్రే చేశారు. ఈ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో వర్షంనీరు, మురుగు నిలిచిపోవడంతో పాటు పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో స్థానికులు పడుతున్న అవస్థలను వివరిస్తూ సాక్షి ఆదివారం 'కలవరపెడుతున్న ఖాళీస్థలాలు' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన మలేరియా విభాగం అధికారులు డివిజన్‌లో దోమల నివారణ మందులు స్ప్రే చేశారు. ఖాళీస్థలాలు మెరక చేయించుకోవాలని వాటి యజమానులకు సూచించారు. అలాగే పారిశుద్ధ్య సిబ్బంది ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, చెత్తచెదారం తొలగించారు. కార్యక్రమంలో శానిటరీ మేస్త్రి శ్రీను, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.



నీటి నిల్వలలో గంబూసియా చేపలను వేస్తున్న మలేరియా విభాగం సిబ్బంది